# అనగనగా... ఒక కథ

అందమైన 20 ఏళ్లమ్మాయి పరుగు పరుగున మా ఇంటికొచ్చింది!

నేనూ సరస్వతీ విస్తుపోయాం- ''ఎవరమ్మా నువ్వు'' అని అడిగాం-

తనని ఎవరో తరువుతున్నారని... కొంచెంసేపు నన్ను దాక్కోనియ్యండి అని ఏడిచింది-

## సంతోషిణి

రకరకాల కథలు విన్న మాకు మనుషుల మీద నమ్మకం తక్కువైపోయింది! కానీ ఆ అమ్మాయిని చూస్తే జాలేసింది! నమ్మాలనిపించింది!!

''అమ్మాయ్ నీ పేరేంటమ్మా...''

''సంతోషిణి''

''మీ నాన్నగారు??...''

''అంకుల్ అది అడగాలా?- అది చెప్తే గాని నన్నిక్కడ దాచిపెట్టరా??''


''అంకుల్ ఏంటి.. తాత! తాతా అనమ్మా! మా వారికి కట్టుడు పళ్లు- నెలకి రెండుసార్లు జుట్టుకి నేనే నల్ల రంగేస్తాను'' అంది సరస్వతి నవ్వుతూ-

''నన్ను తాతా అంటే మీ ఆంటీని.. బామ్మా అనో- అమ్మమ్మా అనో అనమ్మా...''

''అమ్మమ్మా అనే అంటాను... అచ్చం మా అమ్మలా ఉందీవిడ!''

''మీ అమ్మ పేరేంటమ్మా??''

''అది కూడా చెబితేనే ఇంట్లో దాక్కోనిస్తారా?''



సరస్వతికీ నాకూ కూడా ఇంకా విషయం ఎక్కువగా అడిగి తెలుసుకోవాలనిపించట్లేదు... అందమైన ఆ చిన్నారిని ఇబ్బంది పెట్టాలనిపించలేదు... ''సంతోషిణీ... వంటింట్లో దాక్కోమ్మా..'' అంది మా సరస్వతి.

నాకెందుకో పెద్ద ఇష్టం లేదు.. ఈ వయసులో రిస్క్ చేసే శక్తి లేదు.. ఆ అమ్మాయిని ఎవరు తరుముతూ వస్తున్నారో.. ఎందుకు పారిపోయి వస్తోందీ.. ఇలాంటి పాయింట్లెన్నో... చర్చించే టైం ఇవ్వట్లేదు సరస్వతి.

పిల్ల బంగారం ముద్దలా వుంది.. నిజం..

కష్టంలో ఉందంది.. అదీ నిజం.. కావచ్చు..

కానీ.. తరుముకొచ్చేవాళ్లు ఎవరూ..

కాస్తన్నా ఆలోచించాలి కదా.. సరస్వతికీ నా అంత టెన్షన్ లేదు.. దాక్కోమ్మా అంటూ వంటిల్లు చూపించింది... పరుగెడుతూ సంతోషిణి లోపలికెళ్లిపోగానే... ఇంటి ముందు ఐదు బైకలు ఒక్కసారిగా ఆగాయి.

''ఇలా ఎవరైనా అమ్మాయ్ వచ్చిందా...''

''అమ్మాయా... ఎవరూ రాలేదే..'' అంది మా సరస్వతి.

''ఎవరు అమ్మాయి.. అమ్మాయి రావడమేంటి'' అని ఉత్సుకతగా అడిగాను.

అసలు ఎక్కడి పిల్లా.. ఎందుకు పరుగెడుతోందని సంతోషిణి గురించి ఆరా తీయాలని అడిగాను.

''అహాఁ.. ఆ అమ్మాయా బాబూ..'' తూర్పు వీధి వైపు చూపిస్తూ ''అలా పరుగెడుతుంటే చూశాను'' అంటూ నా భుజం గిల్లింది.. సరస్వతి తెలివితేటల మీద నాకెప్పుడూ నమ్మకమే.. కానీ ఇంత ముఖ్యమైన విషయం తెలుసుకోకుండా గిల్లేసిందంటే.. నాకు తిక్కరేగింది.. నేను విషయం తెలుసుకుందామనే లోపుగానే వాళ్లు సరస్వతి చూపించిన వైపుకి వెళ్లారు.

''ఇదిగో మీకు మళ్లీ చెబుతున్నాను.. ఆ పిల్లని ఎక్కడినుంచి వచ్చావ్.. ఎందుకు పారిపోయి వచ్చావ్.. అసలు నీవెవరూ.. అని అడక్కండి..'' అంది.

''నేను అడగను.. నువ్వే నెమ్మదిగా కనుక్కొని నాకు చెప్పు.. మగాళ్లు అన్నాక ఆడపిల్లలకి వచ్చిన ప్రాబ్లంని సాల్వ్ చేయాలి..'' అని మేకపోతు గాంభీర్యంతో అన్నాను.. సరస్వతి నా మొహంకేసి.. అదోలా చూసి లోపలికి వెళ్లిపోయింది.

★ ★ ★

నేను పడుకున్నానుగానీ.. నిద్రపట్టట్లేదు.. ఎందుకో శకుంతలే గుర్తొస్తుంది.. శకుంతలకి పెళ్లి చేద్దామని బ్యాంక్‌లో డబ్బులు.. తెలిసున్నవాళ్ల దగ్గర అప్పులు, అన్నీ సిద్ధం చేసి పెట్టుకున్నాను.. ఇంతలో మా అమ్మాయి ''నాన్నా నేను ఆర్యని పెళ్లి చేసుకుంటాను'' అంది.. అహాఁ.. అన్లేదు.. ఆర్యతో ఇంటికొచ్చి ''ఈయనే నా మొగుడు..'' అంది.. నా అహం దెబ్బ తింది.. 'గెట్ అవుట్'' అని గట్టిగా అరిచాను.. నన్ను సముదాయించి.. కూతుర్నీ.. అల్లుడ్నీ ఇంట్లోకి తెద్దామనుకున్న సరస్వతి కూడా నా అరుపులకి షాక్ అయ్యింది.. వాళ్లు వెళ్లిపోయేవరకూ సరస్వతి ఏం మాట్లాడలేదు.. శకుంతల వెళ్లిపోయాక ఇరవై ఏళ్లు నాతో మాట్లాడలేదు.. మా ఇద్దరిదీ మూగ కాపురమే..

పక్కవాళ్లో... పనిమనిషో.. తనకేం కావాలో చెప్పేవాళ్లు. నేను చేస్తూండేవాణ్ణి.. ఇరవై ఏళ్లు పోయాక ఇన్నాళ్లకి నాతో మాట్లాడీ.. మాట్లాడనట్టు మాట్లాడింది మా సరస్వతి- సంతోషిణి మా ఇద్దరికీ మాటలు కలిపింది..



అందుకని ఆ పిల్లంటే నాక్కొంచెం ఇష్టమేర్పడింది.. ఇంకేమి అనర్థాలొచ్చి పడ్తయ్యో.. అనే భయం కూడా ఓ పక్క సలుపుతోంది...

★ ★ ★

ప్రొద్దున్నే న్యూస్ పేపర్.. బయట పడుకున్న నా ముఖంపై పడింది.. సరస్వతి కొట్టి లేపిందేమో అనుకొని ఉలిక్కిపడి లేచాను.. సరస్వతి కాదు.. ఆ పిల్ల ఎవరూ.. ఊఁ.. సంతోషిణి..! వాళ్లిద్దరు లోపల పడుకుని నాకు ఆరుబైట పక్క డిసైడ్ చేశారు.. కదా.. అని జ్ఞాపకం వచ్చి పేపర్ చూశాను.. అందులో ఓ ప్రకటన నా దృష్టిని ఆకర్షించింది... కారణం.. సంతోషిణి ఫోటో ఉండటం.. ప్రక్కనే వున్న కళ్లజోడు వెతుక్కొని పెట్టుకున్నాను.

''బంగారు తల్లీ... సంతోషిణీ.. నీకిష్టం లేని పెళ్లి మేం చెయ్యం.. మీ నాన్నగారు కూడా.. నీకోసం బెంగ పెట్టుకున్నారు.. నువ్వు ఎక్కడున్నా వెంటనే రావాలి..

ఇట్లు

మీ అమ్మ శకుంతల..''

శ.. కుం.. త.. ల.. మా అమ్మాయి.

సంతోషిణి ఫోటో కూడా ఉంది.. 'మా అమ్మలా ఉన్నావ్.. నిన్ను మా అమ్మమ్మా అని పిలుస్తాను' అన్న సంతోషిణి మాట గుర్తొచ్చింది...

అంటే.. సంతోషిణి మా మనవరాలన్న మాట.. మా శకుంతల కూతురన్న మాట.. అందరినీ కలిసే సమయమొచ్చిందన్నమాట... అనుకుంటూ ఏదో తెలియని ఆనందంలో.. దుఃఖంలో.. దుఃఖానందంలో ''స.. ర.. స్వ.. తీ..'' అని గట్టిగా పిలిచాను.

సరస్వతి పేపర్ చూసింది.. కన్నీళ్లమయమైపోయింది.. ''అంటే.. సంతోషిణి మన మనవరాలా..''

''కాదు.. మా శకుంతల కూతురు...'' అన్నాను గుండెల మీద తట్టుకుంటూ...

ఇద్దరం ఆనందాన్ని తట్టుకోలేకపోయాం... ఈ తర్వాత కథ నేను చెప్పక్కర్లేదు..మా అమ్మాయి శకుంతల ఇరవై ఏళ్ల తర్వాత మా ఇంటికొచ్చింది.. నా ఫోన్ పిలుపు వినగానే..

శకుంతల సరస్వతిని కౌగిలించుకుని ఏడ్చింది.. ఆ తర్వాత తన కూతుర్ని.. అదే మా సంతోషిణిని కౌగిలించుకుని భోరుమంది.. ఎప్పుడో... ఓ పది నిమిషాలు దాటిందేమో నా కూతురు నాదగ్గరికొచ్చి గుండెల్లో ఒదిగిపోయింది. ★

## షారుఖంటే అంతిష్టం!

***కరీనా కపూర్‌కి షారుఖ్ ఖాన్ అంటే ఎంత ఇష్టమో తెలుసా? అతను నటించిన 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే' సినిమాని ఇప్పటి దాకా ఆమె 150 సార్లు చూసిందిట. వీలైతే ఇంకా మరిన్నిసార్లు చూస్తుందిట కూడా. ఆ సినిమాలో అతని నటన అంతగా తనకి నచ్చింది అంటుంది కరీనా. బాగానే వుందిగానీ ఈ సంగతి ఆమె బాయ్‌ఫ్రెండ్ కమ్ సినీ హీరో షాహిద్ కపూర్ గనక వింటే ఏమనుకుంటాడూ?***